ములుగు రూరల్ ః ములుగులో కురుస్తున్న వర్షం

ఏటూరునాగారం : రోడ్డుపై నిలిచిన వరద నీరు

వాజేడు : ధాన్యంపై పరదాలు కప్పుతున్న రైతులు

గోవిందరావుపేట : అభ్యుదయ కాలనీ వాసులతో మాట్లాడుతున్న సీఐ శంకర్

ఎడతెరిపి లేని వాన

- తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షం
- నేల వాలిన వరి, మిర్చి పంటలు
- పలుచోట్ల తడిసిన ధాన్యం
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు

ములుగు రూరల్, డిసెంబర్ 5 : మిగ్‌జాం తుఫాన్ ప్రభావంతో ములుగు జిల్లాతో పాటు మండల వ్యాప్తంగా ఎడతెరిపి లేని వర్షం కురుస్తున్నది. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చిరు జల్లులతో వర్షం కురిసింది. మధ్యాహ్నం సమయంలో మోస్తరు వర్షం పడడంతో ప్రజలు ఇబ్బందులుపడ్డారు. వరి పంటలు చేతికొచ్చి, రేపో మాపో కోతలు మొదలు పెట్టాలని ఆశించిన రైతులను తుఫాను ఆందోళనకు గురి చేసింది. ఈదురు గాలులతో వరి, మిర్చి పంటలు నేల వాలాయి. కొంత మంది రైతులు కోసి ఉంచిన ధాన్యం రాశులపై పరదాలు కప్పి పంటను కాపాడుకుంటున్నారు. ఈ వర్షం ఇలాగే కొనసాగితే తాము తీవ్రంగా నష్టపోతామని రైతులు వాపోతున్నారు.

ఏటూరునాగారంలో..

ఏటూరునాగారం : మండలంలో తుఫాన్ కారణంతో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. మంగళవారం ఉదయం ప్రారంభమైన వాన రాత్రి వరకు కొనసాగుతూనే ఉంది. దీంతో చేతికొచ్చిన వరి పంట అనేక చోట్ల నేల వాలింది. వరి కంకులు తడిసి పోయాయి. మిర్చి రైతులకు నష్టం జరిగింది. ఇదిలా ఉండగా కొన్ని గ్రామాల్లో ఇప్పటికే కల్లాల వద్దకు చేరిన ధాన్యం కుప్పలు తడవకుండా రైతులు టార్పాలిన్ షీట్లు కప్పుకున్నారు. రెండు రోజులుగా వాతావరణం చల్లబడి ఒక్కసారిగా వర్షం పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రోడ్లపై నీళ్లు నిలిచాయి. ఈదురు గాలులకు అనేక చోట్ల మిర్చి మొక్కలు సైతం నేల వాలాయి. అక్కడకక్కడా పచ్చి మిర్చి రాలిపోయింది.

వాజేడులో..

వాజేడు: మిచౌంగ్ తుఫాన్ నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం అక్కడక్కడా ఓ మోస్తరు వర్షం కురిసింది. రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లు కప్పుతున్నారు. వరి పంట కోస్తున్న సమయంలో వర్షం కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మంగపేటలో..

మంగపేట : మండలంలో తుఫాన్ ప్రభావంతో మంగళవారం ఉదయం నుంచి వర్షం కురుస్తోంది. దీంతో పలు చోట్ల కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. మరికొన్ని చోట్ల రైతులు ధాన్యం కుప్పలపై టార్పాలిన్ షీట్లు కప్పుకున్నారు. పంట చేతికొచ్చే సమయంలో కురుస్తున్న వర్షం వల్ల కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం ఆరబోసుకున్న రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. అనేక చోట్ల వరి, మిర్చి పంటలు నేల వాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

గోవిందరావుపేటలో..

గోవిందరావుపేట : తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సీఐ శంకర్ సూచించారు. ఎస్సై షేక్ మస్తాన్‌తో కలిసి మండలంలోని ప్రాజెక్టునగర్, పస్రాలోని అభ్యుదయ కాలనీని మంగళవారం సాయంత్రం సందర్శించి ముంపు ప్రాంతాల ప్రజలకు పలు సూచనలు చేశారు. భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ముందస్తుగానే ప్రజలు పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు. సమస్యలు తలెత్తితే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని సీఐ తెలిపారు.

వెంకటాపూర్‌లో..

వెంకటాపూర్ : మండలంలో మంగళవారం ఉదయం నుంచి చిరుజల్లులతో కూడిన వర్షం కురుస్తున్నది. వరి పంట చేతికొచ్చే సమయంలో వాన పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో కొన్ని చోట్ల రైతులు ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, పరదాలు కప్పుతున్నారు. అలాగే పత్తి తడిసి దెబ్బతింటుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పంటలు చేతికొచ్చే సమయంలో కురుస్తున్న వర్షాల వల్ల తాము నష్ట పోతామని రైతులు వాపోతున్నారు.

కన్నాయిగూడెం

కన్నాయిగూడెం : తుఫాన్ ప్రభావంతో మంగళవారం ఉదయం నుంచి మండలవ్యాప్తంగా వర్షం కురుస్తున్నది. కోత కోసి ఆరబెట్టిన వరి ధాన్యంపై రైతులు టార్పాలిన్లు కప్పి తడవకుండా జాగ్రత్త పడుతున్నారు. వర్షంతోపాటు ఈదురుగాలులు వీస్తుండటంతో పలు గ్రామాల్లో కోతకొచ్చిన వరిపంట నేలవాలింది.

వెంకటాపూర్ : కురుస్తున్న వర్షం

కన్నాయిగూడెం : ఆరబెట్టిన వడ్లపై కప్పిన టార్పాలిన్లు

అకాల వర్షానికి వరి, మిర్చి పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వెంకటాపురం(నూగూరు)లో..

వెంకటాపురం(నూగూరు) : తుఫాన్ ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం వర్షం కురిసింది. దీంతో వరి కోసి ధాన్యం ఆరబోసిన రైతులు ఇబ్బందులు పడ్డారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పి తడవకుండా జాగ్రత్త పడుతున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో జాగ్రత్తలు పాటించాలి

మహదేవపూర్, డిసెంబర్ 5 : తుఫాన్ నేపథ్యంలో మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తగు జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో రవీంద్రనాథ్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అకాల వర్షం కారణంగా కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యంపై టార్పాలిన్ కవర్లు కప్పాలని సూచించారు. కేంద్రాల్లోకి పశువులు రాకుండా చూడాలన్నారు. అనంతరం మండలంలోని అంబట్‌పల్లిలో ఏర్పాటు చేసిన సంపద వనాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీవో ప్రసాద్, ఏపీవో రమేశ్, ఏఈవో ధర్మేందర్, పంచాయతీ కార్యదర్శి అంగోత్ సమ్మయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో రవీంద్రనాథ్

ముమ్మరంగా వాహనాల తనిఖీ

వాజేడు,డిసెంబర్ 5 : మండలంలోని పూసూరు గోదావరి బ్రిడ్జి సమీపంలోని మండపాక వద్ద హైదరాబాద్–భూపాలపట్నం జాతీయ రహదారిపై మంగళవారం వాజేడు ఎస్సై చావాళ్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్ పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిపోయే వాహనాలు ఆపి క్షుణ్ణంగా సోదాలు చేశారు. అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకోని విచారించారు. అనుమతి పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు.

వాహనాన్ని తనిఖీ చేస్తున్న వాజేడు ఎస్సై

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

ఐదు వేల మందికి వైద్య పరీక్షలు

- డీఎంహెచ్‌వో అప్పయ్య
- మహిళా ఆరోగ్య కేంద్రం సందర్శన

ఏటూరునాగారం, డిసెంబర్ 5 : మండల కేంద్రంలోని ఆరోగ్య మహిళ కేంద్రాన్ని మంగళవారం డీఎంహెచ్‌వో అప్పయ్య సందర్శించారు. నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ సెంటర్లు ఏర్పాటు చేసి 40 వారాలైనట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఐదు వేల మందికి పరీక్షలు నిర్వహించామన్నారు. ప్రతివారం నిర్వహించే ఈ కేంద్రాలను మహిళలు వినియోగించుకోవాలని సూచించారు. మహిళలకుఎలాంటి వ్యాధులున్నా ఈ సెంటర్‌కు వచ్చి వైద్యంతో పాటు సలహాలు, సూచనలు పొందవచ్చన్నారు. ఏటూరునాగారంలోని సెంటర్‌కు మంగళవారం 50 మంది మహిళలు వివిధ పరీక్షలు కోసం రాగా వారితో అప్పయ్య మాట్లాడారు. వ్యాధులను నిర్ధారించుకుని చికిత్స పొందాలన్నారు. ఆయన వెంట వైద్యురాలు సుమలత, ఎఎస్ ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పేరూరు పీహెచ్‌సీ సందర్శన

వాజేడు : మండలంలోని పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం డీఎంహెచ్‌వో అప్పయ్య సందర్శించారు. వైద్యం అందుతున్న తీరుపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఏఎస్ఎంలు, ఆశ కార్యకర్తలు గ్రామాలకు క్రమం తప్పకుండా వెళ్లి జ్వరాలున్న వారిని గుర్తించాలన్నారు. వై ద్యులు రోగులకు అందుబాటులో ఉండాలని, అలాగే జ్వరాలున్న గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట వైద్యాధికారి రహీల్, ఎంఎల్‌హెచ్‌పీ నవీన్‌కుమార్, హెచ్ఈ అరుణ కుమారి, హెచ్‌వీ లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాస్, తిరుపతి, సతీశ్, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పండ్లు పంపిణీ

గోవిందరావుపేట, డిసెంబర్ 5 : మండల కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త తుమ్మల రామకృష్ణ జన్మదినం సందర్భంగా మంగళవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు, ప్రభుత్వ దవాఖానలోని రోగులు, ప్రజలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ చేస్తున్న రామకృష్ణ

సమాజంపై అవగాహన కలిగి ఉండాలి

విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిన్న

ఏటూరునాగారం, డిసెంబర్ 5 : పుస్తకాలతో పాటు సమాజాన్ని అధ్యయనం చేయాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జే చిన్న విద్యార్థులకు సూచించారు. కళాశాలలో జిజ్ఞాస స్టడీ ప్రాజెక్టుపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సమాజంపై అవగాహన కలిగి ఉంటే మంచి స్టడీ ప్రాజెక్ట్‌ను రూపొందించుకునే అవకాశాలుంటాయన్నారు. ప్రాజెక్టును రూపొందించుకునే సమయంలో సమస్యలను ఎంపిక చేసుకోవాలని, అలాగే లక్ష్యాలను నిర్దేశించుకొని సమాచారాన్ని సేకరించడంతో పాటు విశ్లేషణ చేసి సత్య నిరూపణ చేసుకోవాలన్నారు. విద్యార్థుల స్టడీ ప్రాజెక్ట్ రాష్ట్ర స్థాయికి ఎంపికైతే ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ. 25వేలు, రూ. 18 వేలు, రూ. 10 వేల నగదు గెలుచుకునే అవకాశం ఉందని ప్రిన్సిపాల్ వివరించారు. కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ యూ స్వామి, అధ్యాపకులు రమేశ్‌కుమార్, విజయలక్ష్మి, ఎం ఘన్‌సింగ్, రేణుక, నవీన్, వెంకటయ్య, జ్యోతి, ఫాతిమా, సంపత్, మున్ని, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చిన్న

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మృతి

మంగపేట, డిసెంబర్ 5 : మండలంలోని కమలాపురానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నాగపురి రాజేంద్ర ప్రసాద్ అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందగా ఆయన పార్థివ దేహాన్ని గ్రామానికి తీసుకువచ్చారు. మృతుడి కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి తుమ్మ మల్లారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ శిద్దంశెట్టి లక్ష్మణ్‌రావు, నాయకులు తుక్కాని శ్రీనివాస్, చల్లగురుగుల తిరుపతి, వెంకటరెడ్డి, సత్యనారాయణాచారి, గోమాస చందర్‌రావు, ఆకుల ప్రభాకర్, వెంకటరెడ్డి, భూక్యా రాములు, రాజేశ్, పరికి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు